# పాలి సీసాలు

కిటికీలో పెట్టిన పాలకవర్లు ఎత్తుకుపోయారని ఒక గృహిణి రోదిస్తోంది. ఎంతమంది ఓదార్చినా ఆగడంలేదు ఆమె దుఃఖం. పార్వతీ పరమేశ్వరులు విహారానికి వెళ్తూ 'ఎందుకా ఇల్లాలు రోదిస్తున్నది' అని తమలో తాము ప్రశ్నించుకున్నారు. 'మీరేమన్నా ఆర్చేవారా తీర్చేవారా? మీకెందుకా గొడవ? మీ దారిన మీరు వెళ్ళండి' అంది ఆ గృహిణి బెంగతో కళ్ళు ఒత్తుకుంటూ.

'ఆర్చేవారమూ మేమే తీర్చేవారమూ మేమే. నీ కష్టసుఖాలు మాకు చెప్పుకో...ఫరవాలేదు.' అన్నారు ఆదిదంపతులు.

"పాలకవర్లు కూడబెట్టినవి అమ్మితే ఒక స్టీలు గిన్నో ప్లాస్టిక్ బకెట్టో వస్తుంది. మళ్ళీ ఎన్నాళ్ళకు పాలకవర్లు పోగవను, వాటితో స్టీలుగిన్నె కాని, ప్లాస్టిక్ బకెట్ కాని సంపాదించను" అని మళ్ళీ ఆలగోలు పాలగోలుగా విలపించింది ఆ ఇల్లాలు.

"స్టీలు గిన్నేవిటి? ప్లాస్టిక్ బకెట్టేవిటి? మోక్షం



**తెలుగు కథాసాహిత్యంలో పురాణం సుబ్రహ్మణ్య శర్మకొక విశిష్టమైన స్థానం ఉంది. ఆయన 'నీలి' కథ తెలుగువారి సృజనాత్మక ప్రతిభకొక సంకేతంగా నిలిచిపోయింది.**

ఇమ్మను లేదా అయిదోతనం ఇమ్మని అడుగు. కడుపు పంటగా పిల్లల్నడుగు. భర్తకి ఏదైనా ఐశ్వర్యం కోరుకో ఇస్తాంకాని, ఇవేమిటి? తుచ్ఛ వస్తువులు. మీసాల మీద తేనియల్లాంటివి" అన్నారు పార్వతీ పరమేశ్వరులు.

"ప్లాస్టిక్ యుగం గురించి తెలియని పార్వతీ పరమేశ్వరులు, స్టీల్ యుగం గురించి తెలియని సీతారాములు నాకెందుకు మొర్రో" అని విలపించింది ఆ గృహిణి. "మీ దారిన మీరు వెళ్ళండి" అని విసుక్కుంది కూడా.

తెల్లబోయారు పాపం పార్వతీ పరమేశ్వరులు. ఇంతలో 'నారాయణ, నారాయణ' అంటూ ప్రత్యక్షమయ్యాడు నారదుడు. జరిగిందంతా నారదుడికి చెప్పారు. నారదుడు నవ్వి "కలియుగంలో పాలకవర్లు, చిత్తు కాగితాలు, న్యూస్ పేపర్లు పాతవి, సీసాలు, డొక్కులు- ఇలాంటి పనికి రాని వస్తువులు అమ్మగా వచ్చే డబ్బుకాని, వస్తువుల వలన కాని కలిగే ఆనందానికి సాటిరావు ముక్తీ, మోక్షం, ఈశ్వరసాయుజ్యం, కైలాసం వంటివి. ఈ రహస్యం మీకు తెలియదు. అంతేకాని మరేమీ లేదు" అన్నాడు. పార్వతీ పరమేశ్వరులు అదృశ్యమైనారు.

* * *


ఉదయం పది, పదకొండు గంటల మధ్య అప్పుడే ఓ లారీ రోడ్డు మీద దుమ్ము రేపుకుంటూ పరిగెత్తింది. ఇదే వర్షాకాలమైతే లారీ చక్రాలు బురద చిమ్ముకుంటూ పోయేవి. గేదెలు కొన్ని అటూ ఇటూ రోడ్డు మీంచి తప్పుకుని పక్కలకు బద్ధకంగా మళ్ళాయి. నారాయణ మెడ మీద అడ్డంగా ఉన్న చేపాటి కర్ర మీద చాచిన చేతులతో సహా మనిషి తప్పుకుని నిలబడి, నోట్లో చుట్ట నోట్లో ఉండగానే దాన్నో పీకు పీకి 'మీ యమ్మ...చొ చ్చొ చ్చో..దారికి మళ్ళండెహె' అంటూ దారిలో ఉన్న గేదె మీదో దెబ్బ వేశాడు. చేతిలోకి తీసుకున్న పొడుగాటి కర్రను చప్పుడు చేస్తూ నేల మీద కొట్టాడు. గేదెల్ని మేపుకురావడం తప్ప అతనికి మరో పనేం లేదు. గెడకర్రలాటి మనిషి. ఉతికిన కాకీ చొక్కా వేసుకున్నాడు. బొత్తాములు పెట్టుకోలేదు. మాసిన పొట్టి పంచె ఎగ్గట్టాడు. కాళ్ళకు చెప్పులు లేవు. భుజం మీదో మాసిన బొచ్చు తువ్వాలు. నెత్తి మీద జుట్టు పీచులు రేగి ఉంది మీసాలు వాలిపోయి ఉన్నాయి. ఆ మీసాల్ని అతనెప్పుడూ ఎవరి మీదా పొరపాటున కూడా దువ్వలేదు. మనిషి అద్దం పగిలి పోయిన పాత ఫోటోలో నలిగిన బొమ్మలా ఉంటాడు. అతను రోజుకో తెలివితక్కువ పని చేసి పెళ్ళాం

మాణిక్యం చేత చివాట్లు తింటూ ఉంటాడు. దాని ధోరణే అంత. దాని చేత మాటలనిపించుకోకుండా ఉండలేడు. అలా కసిరి కావాలని తిట్టించుకోవడంలో ఏదో మిస్టీరియస్ ఆనందం ఉంది. అది అనుకుంటున్నంత తెలివి తక్కువవాడు కాదు. కానీ, తన తెలివితేటల్ని చప్పున బయటపెట్టడు. ఆవిడ వద్దన్న పనులు ఒకటో అరో చేయకుండా ఉన్న రోజు దండగే. ఆ గేదెల మీద తప్ప ఇంట్లో అతనికేమీ పవర్సు లేవు. గేదెల మీద కూడా మేపుకురావడం వరకే.

ఆ కాకీచొక్కా జేబులో కాల్తున్నది కాక మరో చుట్ట, అగ్గిపెట్టె, కొన్ని చిల్లర డబ్బులు.. ఆ చొక్కా అతన్దో కాదో కానీ, ఎరువు చొక్కాలా ఉంటుంది. మాణిక్యం అతని భార్యే కాని ఆవిడ యజమానురాలూ, ఇతను నౌకరని పించేలా ఉంటుంది వారి చుట్టరికంలోని ఆంతర్యం.

అతనికి నాలుగు గేదెలున్నాయి. ఐదుగురు కూతుళ్ళున్నారు. మూడు డాబాలున్నాయి. రెండు నివేశన స్థలాలున్నాయి. అతన్దే పది, పదిహేను వేలు వడ్డీ వ్యాపారం మీద ఉంది. కానీ, నారాయణ అయ్యగారి పాత చొక్కా ఏదన్నా మాసింది ఉంటే ఇమ్మని, చలికి తొడుక్కుంటానని మీ ఆవిడను అడగగలడు. పచ్చడి పెట్టమని మీ ఆవిడనడిగి తెచ్చుకుని తినగలడు. డబ్బు కాని, ఆస్తి కాని, గేదెలు కాని ఎన్ని ఉన్నా ఇంకా తను ఓ మెట్టు కిందే ఉన్నట్లు అనుకుంటాడు. తను తక్కువ్వాడిననే ఉద్దేశాన్ని అతనికి లేకుండా ఆస్తీ, డబ్బూ ఎందుకు చేయలేకపోయాయి? ఆ వీధిలో రెక్కాడితేనే కాని డొక్కాడని ఇల్లూ వాకిలీ, ఆస్తిపాస్తులు లేని తెల్లచొక్కా మనుషులు చాలామందే అద్దె కొంపల్లో ఉంటున్నారు. వారందరికీ నారాయణ తెలుసు. ఎందుకంటే, అందర్నీ అయ్యగారు - అమ్మగారు అని మన్నిస్తూ ఒదిగి ఒదిగి ఉంటాడు. ఆ తక్కువతనంలోని ఎక్కువతనాన్ని అతను

చిత్రాలు: పి. ఎస్. బాబు




**మాణిక్యం వన్‌టవున్లో ఎఱ్ఱగా బుఱ్ఱగా, షావుకారి**

రహస్యంగా ఆనందిస్తూ ఉంటాడు. మధ్యతరగతి మనుమలతనికి అదేలా తెలివితక్కువ వాళ్ళలా అన్తారు. మీకేం మహారాజులని, నెల తిరగ్గానే జీతాలొస్తాయని, ఖర్చులు చేస్తారని ఉబ్బేస్తూ ఉంటాడు. సినిమాల కెళ్ళొచ్చిన ఆడవాళ్ళు నారాయణకు 'స్టోరీ'లు చెబుతూ, మధ్య మధ్య పనులు చేసుకుంటూ వాయిదాల మీద కథ పూర్తిచేస్తారు. నారాయణ ఎదురుగుండా వాళ్ళు ఆడతనం మరిచిపోయి రవికలు మార్చుకోడం, చీరలు దులుపుకోడం, పమిటలు సర్దుకోడం చేస్తారు. వారికి ఎబ్బెట్టుగా అనిపించనంత దగ్గరయ్యాడతను. అతని తెలివి తక్కువతనంలో మంచితనం మిళితమై ఉంది. అతను బయటి ప్రపంచాన్ని అర్థం చేసుకోకుండా ఈ తవ్వుకున్న మాయలో కూరుకుపోయాడు. ఈ సంగతి మాణిక్యానికి తెలియనే తెలియదు. తను లేనప్పుడు ఆ ఇంటికీ, ఈ ఇంటికీ వెళ్ళి పోసుకోలు కబుర్లు చెబుతాడని అప్పుడప్పుడు కేకలెయ్యాలి కనక కేకలేస్తూ ఉంటుంది.

ఆరోజు గేదె ఒకటి తప్పిపోయింది. 'బందెల దొడ్డికెళ్ళి ఎతికేవా' అంది. వాళ్ళిద్దరికీ గేదెల గురించే తగూ.

'అదక్కడ లేదు' అని ఊరుకున్నాడు. రెచ్చిపోతుంది అని తెలుసు. 'దొంగ గొడ్డు ఎవరి దొడ్లో పడిందో' అంటూ, ఏబ్రాసి మొకం అనీ, ఎక్కడో చుట్ట కాల్చుకుంటూ కూచుంటే తప్పిపోయిందనీ మాణిక్యం తిట్టింది. మర్నాడు తెల్లారకట్లకి ఒళ్ళంతా చీరుకుపోయి దెబ్బలు తిని బేజారెత్తిపోయిన గొడ్డు ఇంటికి పారొచ్చింది. వెంటనే నారాయణ దానికి ఒళ్ళు కడిగి, ముళ్ళు తీసి, సేవలు చేశాడు. కుడితి పెట్టాడు. చొప్ప తెచ్చి వేసి దాన్ని నిమురుతూ కూర్చున్నాడు. మాణిక్యం రఁయ్ రఁయ్‌మంటూ వచ్చి బడితె తీసుకుని పారిపోయినందుకు శిక్షగా గేదెను బాదబోయింది. నారాయణ అడ్డం వెళ్ళి చొక్కా విప్పి నిలబడ్డాడు. లెమ్మని బడితె విసిరేసింది. అది నారాయణ కాలిమీద పడి కింద పడ్డాడు. అతన్ని పట్టించుకోకుండా గేదెను మళ్ళీ బాదింది. నారాయణ లేచి మాణిక్యాన్ని తోయబోయాడు. కానీ, లేవలేక వెల్లకిలాపడ్డాడు. ఇదంతా కనుచీకటి వేళ - మాణిక్యం పడిపోయిన నారాయణను పట్టించుకోకుండా, దంపుళ్ళకు పోయింది. తెల్లగా తెల్లారాక నారాయణ కుంటుకుంటూ లేచి తలగుడ్డతో కాలికి మెలిపెట్టి కట్టి 'కోపదారి ముండ' అని తిట్టుకున్నాడు. రాత్రి పాలు తియ్యలేదు. ఉదయం పాలు లేవు. ఎంత నష్టం? అదీ దాని కోపం. లెక్క ప్రకారం అందరిళ్ళకూ పోయి పాలు పోసి వచ్చాడు కాస్త కుంటుతూనే.

విజయవాడ వన్ టవున్లో ధాన్యం దంపుళ్ళకు పోయి వస్తూ ఉంటుంది మాణిక్యం. తెల్లారీ తెల్లారకుండా పోయి బాగా పొద్దుపోయాక దంపుళ్ళన్నీ ముగిశాక లేటుగా వస్తూ ఉంటుంది. బియ్యం షావుకారి బెల్లం సుబ్బయ్యకు మాణిక్యం ఎంత చెబితే అంత. దంపుళ్ళకు వచ్చే ఆడకూలీలందరి మీదా మేస్త్రీని చేశాడు మాణిక్యాన్ని. ఇంటి దగ్గర ఉగ్రనరసింహమూర్తిలా ఉంటుంది కాని టవున్లో బియ్యపు షావుకారి దగ్గర జాణే. ఆడ కూలీలంతా వెళ్ళిపోయాక కూడా బెల్లం సుబ్బయ్య, మాణిక్యం కూర్చుని గుసగుసలాడుతూ ఉంటారు. ఏవేవేవిటో కబుర్లు చెప్పేస్తూ ఉంటుంది మాణిక్యం. గేదెల దగ్గర, మొగుడు నారాయణ దగ్గర ఉన్నప్పుడు మాణిక్యం ఖరాఖండీగా నోరు పారేసుకునే గయ్యాళిలా కనిపిస్తుంది. కాని, వన్ టవున్లో ఎర్రగా బుర్రగా ఉన్న బియ్యపు షావుకారి దగ్గర రంగరంగేళిగా ఉంటుందంటారు. పాపపుణ్యాలు భగవంతుడి కెరిక.



దగ్గర రంగరంగేళీగా ఉంటుందంటారు.

తప్పిపోయిన గేదె వల్ల కలిగిన కోపంలో అలా వెళ్ళిపోయింది కాని, మాణిక్యం ఆడగుణంచేత నుంత కరగకుండా ఉండలేకపోయింది. మధ్యాహ్నం కూతురొచ్చి అయ్య కాలేదో విరిగినట్లుంది, కట్టు కట్టామని చెప్పింది. కూతుళ్ళకు తండ్రంటే మక్కువ. మనసు కరిగింది కాని మాణిక్యం బెట్టు సడలనివ్వకుండా 'జనం సీసాలకి ఎగబడుతున్నారు. ఈ గేదెల కామాటం ఎందుకిక - అమ్మేస్తే పోలా' అంటూ వచ్చింది. కూతుళ్ళు తండ్రికి కాపడం పెట్టి, పడుకోబెట్టి చుట్టూ కబుర్లు చెబుతూ కూచున్నారు. తల్లి పట్టి డబ్బు కాపీన్నం మనిషి. పిసినిగొట్టుతనం వేరు, దుష్టతనం వేరు. ఎవరూ మాట్లాడ లేదు. నసుగుతూ "గేదెలుకూడా లాపోతే ఎలా" అన్నాడు నారాయణ. గేదెలు లేని జీవితాన్ని ఊహించుకోను కూడా ఊహించుకోలేడు నారాయణ. 'నాకెట్లాగ? సేతులూ కాళ్ళూ ఇరగదీసినట్లుండదూ' అని గునిశాడు.

'సీసాపాలొత్తున్నాయ్. సీసాలు మరిగితే జనం...' అంది ముందుకు వచ్చి కావాలని నారాయణ కాలు రాస్తూ. 'సీసాలు సీసాలే, గేదెలు గేదెలే ' అంది నారాయణ కూతురు. కూతుళ్ళు కాలు రాసినప్పుడు ఏమీ అనిపించని నారాయణకు పెళ్ళాం రాస్తూండగా పులకలెత్తి 'నువ్వొద్దులే - నువ్వొద్దులే' అన్నాడు కాలు వెనక్కు లాక్కుంటూ.

'ఎట్టెట్టా? ఆవదం కాచి మర్దనా చెయ్యాల్సిందే - ' అని ఆవదం కాపించి చురుక్కు చురుక్కుమంటూంటే బలవంతంగా కాపడం పెట్టింది. 'అమ్మా, పాడండే' అన్నాడు తండ్రి వాళ్ళెక్కడ పోతారో తల్లికి తన్నొదిలి అని. కూతుళ్ళు కాస్సేపు ఒకరి ముఖం ఒకరు చూసుకుని ముసిముసిగా నవ్వి ఇలా అందుకున్నారు.

"ఎంత పేదవాడే - వేణుగోపాలు డెంత పేదవాడే
అంత పేదగాకుంటే అలనాడా కుచేలుని
అటుకులకు చేసాచునా - ఓ చెలులార ॥ఎం॥
పండ మంచమెయుంటె భావజనకుడీ
పాముపై నిద్రించునా ॥ఎం॥
అండ వేరేయుంటే అచ్యుతుడాదను జూచీ
అవని దానమడుగునా ॥ఎం॥
ఉండ నిల్లే ఉంటే పుండరీకాక్షుడు
యుధధి వానము జేసునా ఓ చెలులార" ॥ఎం॥

"అమ్మా, నాలా గొడ్లు కాసేవాడు కాదా మీ మువ్వ గోపాలుడు" అన్నాడు నారాయణ.

"కట్ట వస్త్రమేయుంటె కంసవైరి గో - పాం
గన చీర లాశించునా
గొట్టుబడకో యుంటె గోవిందుడీగతి
గోవుల తా గాచునా
పొట్ట నిండితె శౌరి పొరిగింళ్ల జొరబడి
పొంచి వెన్న ముచ్చిలునా ఓ చెలులార
ఎంత పేదవాడే - వేణుగోపాలుడెంత పేదవాడే..."

కూతుళ్ళు తండ్రికి బలం. వాళ్ళందరినీ బుజాల మీదెక్కించుకుని మోసినవాడే నారాయణ. మాణిక్యం తిట్టినా కొట్టినా జడలు దువ్వి, తలలు కడిగి, నీళ్ళు పోసి ఆటలకు పంపేవాడు నారాయణ. పెద్దయి పెళ్ళిళ్ళయి అంతా ఆ వీధిలోనే కాపరాలు. కనపడని ఎరుపు అంతా ఎరుపే కాని నల్లని నలుపెవరూ కాదు. అందెలూ కడియాలూ అందరికీ... చేయింపించింది. బులాకీలు, నత్తులు, గుల్ల కంటెలు, జిగినీ గొలుసులు కూతుళ్ళందరికీ ఉన్నాయి. కండువా, పంచె గట్టి నారాయణ సత్యనారాయణవ్రతం పీటల మీద కూతుళ్ళతో, అల్లుళ్ళతో కూచుంటే అందరికీ ఎకసక్కెంగా ఉంది. నారాయణ కాదు పొమ్మనట్టు చూశారు. ఎవరో కొత్త మనిషనుకున్నాయి గేదెలు సయితం. మొగుణ్ణి కొట్టి పడదోసిందన్న పాపం బోటానికి సత్యనారాయణవ్రతం పెట్టించింది మాణిక్యమ్మ. బ్యామర్ల ఇళ్ళకు ప్రసాదాలు పంపించింది. అల్లుళ్ళకు, కూతుళ్లకు బట్టలు పెట్టింది. ఇంత జరిగాక ఆ రోజున కూడా మధ్యాహ్నం దంపుళ్ళకు పట్నం బోయింది.

పాల వాడికల్లో ఎవరెవరికి ఎంతెంత పోసేదీ, వాళ్ళు ఎంత ఇచ్చేదీ అన్నీ మాణిక్యానికి లెక్కే. నారాయణ అప్పుడప్పుడూ కావాలని తికమకలు చేస్తూ ఉంటాడు. మాణిక్యానికి తెలీకుండా అతనికి

బ్యామర్ల కాతా ఒకటీ, రైల్వే గుమాస్తా కాతా ఒకటీ ఉంది. ఇద్దరమ్మలూ చిన్నవాళ్ళే - సినిమాల్జూసి స్టోరీలు చెప్తారు. రైల్వే గుమాస్తా పెళ్ళం పాటలు కూడా పట్టుకుని పాడి వినిపిస్తుంది. కూరానారా లేదనకుండా వడేస్తుంది.

ఉన్నట్లుండి ఊళ్ళోకి హఠాత్తుగా పాలసీసాలొచ్చాయి. పాల సీసాలు రెండేసి రూపాయలెట్టి ఎన్ని కావలిస్తే అన్ని కొనుక్కుని పెట్టేసుకోవాల. పాలమ్మేచోట్లని బూతులంటారు. అక్కడికెళ్ళాల తెల్లారకుండా - కార్డు కొనుక్కోవాల నెల్లాళ్ళకీ ముందు డబ్బు కట్టి. అప్పుడు పాలిస్తారు ఎన్ని సీసాలు కావలిస్తే అన్ని. ఈ భోగట్టాలు రైల్వే గుమాస్తా పెళ్లాం చెప్పింది. "టోనుడు అంటే వెన్న తీసేసినవి రూపాయి ముప్పై అయిదు పైసలయితే, వెన్న తియ్యని మంచి పాలు రూపాయి అరవై పైసలు అర లిటర్. నెహ్రూగారు రష్యా వెళ్ళి, ఇంకా ఇతర దేశాల్లో ఈ పద్ధతి చూసి ముచ్చటపడి మన దేశంలో కూడా కాన్వెంటు స్కూళ్ళు, యూనిఫారాలు స్కూలు పిల్లలకు, ఈ పాలసీసాలు ప్రవేశపెట్టారు. మొదట్లో ఢిల్లీలో వెన్న తీసిన పాలు ముప్పై అయిదు పైసలుంటే, తియ్యనివి అరవై అయిదు పైసలుండేవి. పావలాకి పావు లిటర్ సీసాలు కూడా ఇచ్చేవారు. పూర్వం గేదెలకు చిట్టూతవుడు, గడ్డీ గ్రాసం లాటివి ఉంటే, ఇప్పుడు దేశమంతటికీ సరిపడే సీసాలు తయారవ్వాలె."

"కలికాలం! గేదెలు లేకుండా పాలమ్మడవేటి?" నారాయణ వెక్కిరించాడు. "నిన్నటి పాలు, మొన్నటి పాలు- మంచీ లేదు చెడూ లేదు. అన్నీ అమ్మెయ్యటవే?"

"పాలు విరిగితే అంతే - సీసాకేసి చూస్తూ భోజనం చెయ్యాలిసిందే."

బ్యామర్లావిడ "నారాయణా నువ్వీక పాల వ్యాపారం ఎత్తికట్టెయ్యొచ్చు -" అంది. జనం సీసాలకు ఎగబడ్డం వచ్చాక పాల వ్యాపారం దెబ్బతింటుందని నారాయణ జంకాడు. గేదెల్ని ఏం చెయ్యడానికీ మనసొప్పలేదు. పాలు గవర్నమెంటుకు అమ్మాలంటే చచ్చే రూల్సు - మీటరేస్తారు, గ్రేడింగ్ అని ఇస్తారు. ఆఫీసర్ల చెకింగులు నానా గొడవలుంటాయి.

"సీసాపాలు మరిగితే జనం ఆరోగ్యాలు అంతే -" అన్నాడు నారాయణ శపిస్తూ. లోపల బస్సొచ్చి బళ్ళవాళ్ళ కడుపు కొట్టినట్లు అవదుగదా అని బెంబేలుపడిపోయాడు.

రాత్రి లేటుగా వచ్చిన మాణిక్యం వీపు గోకాడు పెద్దమంచంమీద.

"ఇప్పుడల్లాటియ్యేం వద్దంటూంటే -"

"అబ్బ నీయవ్వ, అది కాదే గోల - ఇడ్డిరుగు."

మాణిక్యం తవుడుచిట్టు అక్కవుంట్లు, పాలఖాతాలు మనసులో గుణించు కుంటోంది.

"ఏంటట నీ తగూ-" అంది ఇటు తిరిగి జుట్టు సర్దుకుంటూ - నారాయణ కాలితో కాలిమీద గోకుతూ. "నీ యవ్వ ఈ సీసాలేటి - జనం సీసాల్ని మరిగితే, మన గేదె లేటిగావాల?"

"పాలయాపారం జెయ్యాలంటే గేదెలుండాలని రూలేం లేదు" అంది మాణిక్యం. "నీదంతా అడ్డకోలు యవ్వారం" అన్నాడు స్పష్టంగా చెప్పమని.

"నువ్వు ముందా కాలు తియ్యి - ఏంటా పోకిరీ చేష్టలు?" నారాయణ కిసుక్కున నవ్వి చెయ్యి బారసాచాడు. మాణిక్యం కొప్పు తగిలింది.

"కుంటి కాలేసుకుని ఇప్పుడీ సింగారం ఎందుకో" అని ఊరుకుంది.

"నీ ఆలోశన నాకర్తవయింది. పాలయాపారం నడన్గా పడిపోతే నాలుగు గేదెల్ని నష్టానికేగదా అమ్మాలి. అవుననుకో - ఈ గేదెల్ని కాస్తా అమ్మితే రోజల్లా నీకేంటి పని? ఇంటికయిన మగాడికి పని లేకపోతే చెరుపే. అందులో నీలాటి సోమరికి పనేం ఉండదు. అమ్మలక్కలతో ఊసులాడతా కూకుంటావ్."

మాణిక్యానికి ఒళ్ళు తగిలేలా మీదకు జరిగాడు.

"నీతో సెడ్డ గొడవొచ్చిందే ఇయ్యాల -" చేత్తో తొయ్యబోయింది. ఆ చేతిని అలా గాల్లో పట్టేసుకుని గమ్మున దగ్గరకు లాగేసు కున్నాడు. మాణిక్యానికి షావుకారు కౌగిట్లో కక్కుర్తి, ఫ్రీగా వచ్చింది జుర్రుకోవా లనుకునే యావ కనిపించింది. అక్కడ షావుకారిని ఓ ఆట ఆడించింది. నారాయణ మెతక మనిషైనా దగ్గరకు రావడంలో ఒక హెూదా కనపరుస్తున్నాడు. "కాలు - కాలు" అంది బిగ్గరగా. నవ్వాడు.

"ఆ కాలు అలా కుంటకపోతే నేనీ పెద్దమంచం మీదెక్కేవాడినా - నువ్విక్కడ తొంగునేదానివా" అని కిసుక్కున బుగ్గ కొరికాడు. మండింది. వటపత్రశాయిలా నారాయణ మంచం అంతా కమ్మాడు. మాణిక్యంలో ఎన్నాళ్ళుగానో ఆరిపోయిన దీపం రాజుకుంది. సీసాల్లో పాలు కొత్తగా కనిపించినట్లు నారాయణ ఎంతో కొత్తగా ఉన్నాడు. అది దుస్తుల్లో, మాటల్లో, నడవడిలో కనిపించేది కాదు. పెళ్లాం అయినా కాకపోయినా అది ఆడదానికే తెలుస్తుంది. లోకువగా చూడడానికి ఇతర కారణా లనేకం ఉండవచ్చు కాని, ఇది మాత్రం కాకూడదు.


సోమరిపోతనుకుని నారాయణకు పని కల్పించడం కోసం గేదెలున్నాయనుకొంటున్నది మాణిక్యం. అలా అనుకునే మరో పెద్ద తప్పు చేసింది. ఇంట్లో పెరడంతా అయోమయం జీమూతంగా ఉండేది. కంపలు, పేడతట్టలు, ముళ్ళ పొదలు, జిల్లేడు కంపలు... వాటి మధ్య కూలిపోతున్న గుడిసెలాటిది ఉండేది. అదంతా బాగు చేయడానికి చంద్రమ్మని చేరదీసింది. దాని కళ్ళు అద్భుతంగా నవ్వుతున్నట్లుండేవి. అది గోచీ పోసి బిగించి, ఎర్రటి ఆకుపచ్చటి ముదురు రంగు చీరలు కట్టేది. ఏవో పాటలు పాడేది పని చేస్తూ. అవి ఇలా ఉండేవి -

"దంచు పిల్లా దంచు
దంచీనా నూకలుంచు
నామీద దయాలుంచవే - గంగ
రామసిలక" - అనో,

"నాలుగు మూలాల రాయి
నందన్న రాయి నల్గురు ఇసిరేరు-
ఓ నల్గురు ఇసిరేరు నందాన్నా రాయి
నల్గురు ఇసిరేరు నిన్ను గౌరమ్మా"
అనిగాని పాడేది.

ఇంకా వినుర్రాయి పాట పాడేది.

"జలజలా రాలేటి జాజిమల్లేలు
కిలకిలా నవ్వేటి కలికి సిలుకాలు
ఏమి సూసి నవ్వితిరే
ఎలపక్షులారా




మాణిక్యంలో ఎన్నాళ్ళుగానో ఆరిపోయిన దీపం రాజుకుంది.

తాద్దములో నీ నీడ దిద్దంగా జూసి -"

ఇలా పాడుతూ దాని చేత పని చేయిస్తూ నారాయణ కూడా కూడా తిరుగుతూ ఇద్దరూ ఏవో మాట్లాడు కునేవారు. దంపుళ్ళకు పోతూ, షావుకారి సుబ్బయ్య హడావిడితో ఊపిరి సలపక వాళ్ళిద్దర్నీ తన జోలి కెక్కడ వస్తారో అన్న బెదురుతో అలా వదిలేసింది మాణిక్యం. అది పొరపా టయింది. నారాయణ చంద్రమ్మకు అతుక్కు పోయాడు. ఆ దొడ్లలో ఏం చేసేవారో, ఎక్కడెక్కడ పశువుల్ని మేపుకుంటూ తిరిగేవారో - ఇవన్నీ చూడ్డానికి మాణిక్యానికి తీరికెక్కడిది? దాన్నుంచుకున్నాడు, దాన్ని పోషిస్తున్నా డని పేరొచ్చేసింది నారాయణకు. "సిగ్గు లేదా? దాంతో నీకేటి? ఒగ్గెయ్యి". కేక లేస్తే ముసి ముసి నవ్వులు నవ్వి ఊరు కునేవాడు. తరవాత పురిట్లో పోయింది పాపం చంద్రి - అది వేరే కథ.

* * *



చీకట్లో లేచి పాలబూతుకెళ్ళే ఓపిక లేనివారికి 'మాణిక్యం' కామధేనువు.

ఆ వీధిలో చాలామంది నెల జీతాల మీద బతికేవాళ్ళు నీళ్ళు కలవని శుద్ధమైన పాల సీసాల కెగబడిన మాట నిజమే. కానీ, చేతిలో సొమ్ము లాడక, తెల్లారి లేవలేక బద్ధకానికి దాసులై క్రమంగా తప్పుకున్నారు.

"ఏవిటే ఈ కార్డులు, ఇన్ని ఎక్క డివి?" అన్నాడు నారాయణ.

"మన వీధిలో పాలు అక్కర్లేని వాళ్ళకున్న దొంగ కార్డులన్నీ కొను క్కొచ్చేశానివిగో" అంది మాణిక్యం నవ్వుతూ. పాతిక ముప్పై సీసాలు రెండు రూపాయలకు తిప్పించేసింది.

రాత్రి ఒంటి గంట కాంగానే పక్కలో పిల్లిలా ముడుచుకు పడు కున్న మొగుణ్ణో తన్ను తన్నినట్లు లేపి బూతు దగ్గరకెళ్ళి పడుకుని పాతిక సీసాలు పొట్టుకురమ్మని పంపించింది. ఈ పాతిక సీసాల పాలు, ఆ నాలుగు గేదెల పాలు, మరో రెండు బకెట్ల కృష్ణ నీరు కలిపి ఆ సీసాల్లోనే నింపి సీళ్ళవసరం లేకుండా అమ్మించేసింది. నెలజీతాలవారు, ఎప్పటికప్పుడు డబ్బులు పోసి సీసాపాలు కొనుక్కోలేనివారు, అసలు తెల్లారకుండా చీకట్లో లేచి పాలబూతుకెళ్ళే ఓపిక లేనివారి పాలిట 'మాణిక్యం' కామధేనువు. పైగా రేటు సీసా పాలకంటే తక్కువ.

గేదెల చాకిరీకి తోడు బూతుపని తగులుకునే సరికి నారాయణకు పెనం మీంచి మంగలంలో కొచ్చిపడ్డట్లయింది.

నారాయణ పెళ్లాం మంచి మూడ్‌లో ఉన్నప్పుడు "ఈ గేదెల్ని అమ్మెయ్య రాదటెహె" అని ఓ డైలాగు సోక్రటీసులా వేస్తూ ఉంటాడు.

ప్రతి పాల కేంద్రం ఓ వంద గేదెల పెట్టయినప్పుడు, పదీ పరకా పాల బూతోళ్ళకు పారేస్తే- ముందే మన సీసాలు రెడీ అవు తున్నప్పుడు, ఈ గేదెల్ని మేపుకుంటూ అడ్డమైన చాకిరీ చెయ్యడం ఎందుకూ అని పాయింటు. నారాయణ గోల అర్థంగాక కాదు. మాణిక్యం క్రమక్రమంగా మెత్తబడుతూ వస్తోంది. కానీ, ఇంకా పూర్తిగా మెత్తబడలేదు. వెన్నెముక గట్టి ఉంది. గేదెల్నమ్మేస్తే నారాయణకు పగలల్లా "ఏటుంటుంది సెయ్యడాన్కి?" - ఆ కవుంటరు పాయింటుకు జవాబు దొరకనందున గేదెల్నమ్మడం విషయంపై మాణిక్యం చర్చ వాయిదావేస్తూ వచ్చింది. "పాలకేంద్రం ఎప్పటికీ వొట్టిపోని పెద్ద సైజు గవర్మెంటు వారి గేదె అనుకో. గవర్మెంటోళ్ళి ఒక్క పాడిగేదెలా పాపం సీసాల్తో పాలిస్తా ఉన్నప్పుడు ఈ గేదె లొట్టిపోడాలు, ఈటికి దాణా, శాకిరీ మేపుకురావడం ఈ గొడవంతా ఎందుకే మాణిక్కెం" అని నారాయణ పుండు సలిపినట్లు సలుపుతూనే ఉన్నాడు. గేదెల్నమ్మడవంటే టవున్లో అంత సులువేమీ కాదు. సంతలకు తోలుకెళ్ళా లంటే 'సాలా కర్సవుతాది.' పైగా బేరం కుదుర్చుకోడానికి మనిషి గట్టివాడై ఉండాలి. దళారుల ద్వారా బేరం సెటిల్ చేసుకోవాల్సిందే. పైగా గేదెను అమ్మడం, మన ఊళ్ళో అమ్మాయి పెళ్ళిచూపుల తంతులా ఉంటుంది. నారాయణను పూర్తిగా ఇటువంటి వ్యవహారాల్లో నమ్మి విడిచిపెడితే ఏ చంద్రిలాటిదో తగులుకుని బుట్టలోవేసినా వేసెయ్యగలదు. పైకి చెప్పుకోడానికి లేదు.

మాణిక్యానికి ఉన్న సమస్యలు వేరు.

ప్రభుత్వానికి ప్రయివేటు రంగం, ప్రభుత్వ రంగం అని రెండు కురుపులున్నట్లు మాణిక్యానికి తెలీదు. మాణిక్యం అటు దంపుడు బియ్యం కొట్టునీ, బియ్యం కొట్టు సుబ్బయ్యనీ, ఇటు నారాయణనీ, గేదెల్ని మానేజ్ చేసుకొస్తోంది చాకచక్యంగా. మాణిక్యం జీవితంతో గాఢంగా పెనవేసుకుపోయింది. మాణిక్యం కున్న పట్టింపు, పట్టుదల పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఎక్కడుంటాయి? పైగా మాణిక్యానికి ఒక్కడే నారాయణుడు. ప్రభుత్వానికి ఎందరో నారాయణలు.

అదుగో నారాయణమ్మ నెత్తిమీద తట్టపెట్టుకుని తెల్లవారకుండా వన్ టౌన్ వైపు నడచిపోతోంది (సిటీ బస్సెక్కితే సలభై పైసలవుతుందని) - అదుగో నారాయణ చుట్ట కాల్చుకుంటూ - గేదెల్ని తోలుకుంటూ....

* * *

కాలచక్రం గిర్రున తిరిగింది.

పాలసీసాలు పోయాయి. సంచులొచ్చాయి.

నారాయణ పోయాడు పాపం!

పార్వతీ పరమేశ్వరులు మళ్ళీ వాహ్యాళికి బయల్దేరారు. ఇదివరకు గృహిణే పాలకవర్లు లెక్కపెడుతూ పిల్లడి చేత చదివిస్తోంది. వెధవ ముద్దొస్తున్నాడు- యూనిఫామ్‌లో బూటు, టై, స్కూల్‌బేగ్, బండెడు పుస్తకాలు.

"మనకు పాలు ఎల్లా వస్తాయిరా" అని అడిగింది తల్లి. పాలు అంటే తెలుగు తెలీదని 'మిల్క్ కైసా ఆతే బచ్చే' అంది.

'సాచెట్సు' (సంచుల్లో) అని సమాధానం. ఆవిడ తెల్లబోయింది. మళ్ళీ అదే ప్రశ్న వేసింది - ఈసారి పిల్లవాడి డాడీ 'వాడి కవన్నీ ఏం తెలుస్తాయే- వాడెప్పుడూ గేదెను చూడలేదు' అన్నాడు. "అంచేతే పాలు సంచుల్లో వస్తాయని వాడి ఉద్దేశం." పార్వతీదేవి పరమేశ్వరుడితో అంది -

'ఇకముందు భరతవర్షాన్ని పరిపాలించేది వీళ్ళే'నని ఇద్దరూ అంత ర్ధానమయ్యారు. ■